# పోలీసు

లక్ష్మీనారాయణకు అయిదుగురు కూతుళ్ళ వెనుక ఒక కుమారుడు కలిగెను. అదే కడపటి సంతానము. లేకలేక కలిగిన కొడుకు అగుటవలన తండ్రికిని కడసారపు బిడ్డ యగుట వలన తల్లికిని చాల ఆనందముగా నుండెను. అక్కలుగూడ ఆబాలుని చాల గారాబముతో చూచుచుండిరి.

ఆబాలుని బాల్యమును గుఱించి వర్ణించుచు కూర్చుండుటకు మాకు తీరిక లేదు. లక్ష్మీనారాయణ కుమారునకు తన తండ్రిపేరు పుల్లయ్య అని పెట్టెను. తల్లి దీనికి అంగీకరింపలేదు; గాని లాభము లేకపోయినది. తన తండ్రిపేరు ఆమె పోరి రెండవకొమార్తకు పెట్టించుకొనెను. మూడవపిల్లకు తల్లిపేరు పెట్టెను. ఈ కారణము వలన ఆపేరు బాగుగ లేదని మాత్రమే యామె అసంతృప్తి చూపుచుండెను. ఆడు పిల్లలు గూడ అట్లే తలంచిరి. "పుల్లాకుల్లో దొర్లిస్తే గాని పుల్లయ్య అని పేరుపెట్టరుట. ఇదేం పేరే అమ్మా? బాగుండి గాదే. తమ్ముణ్ణి వెక్కిరిస్తున్నారే వీథిలోవాళ్ళు! మార్చగూడదూ?" అని అయిదవ కొమార్త గూడ చెప్పుచుండెను.

తల్లియు కూతుళ్ళును గలిసి యాలోచించిరి. "మానాన్న కోప్పడితే కోప్పడ్డాడు. ఇక మేము ఆపేరుతో పిలవం తమ్ముణ్ణి. రాచకుమారుడులా వున్న పిల్లాడికి పుల్లయ్య పేరేమిటి? "పుల్లయ్య వేంవారం" అని రేపటి నుంచి వూళ్ళోవాళ్ళందరూ ఎక్కిరిస్తూవుంటారు వాణ్ణి. పెద్దఅయినాక వాడికి తెలుస్తుంది. అప్పుడు ఏం అనుకుంటే యేం లాభమూ? "నువ్వేనా చెప్పలేకపోయావా?" అంటాడు నిన్ను. "చూస్తూ వూరుకున్నారా?" అంటాడు మమ్మల్ని. లోకంలో అందఱూ ముద్దినుసు పేర్లూ పెట్టుకుంటూ వుంటే ఈ ముష్టిపేరే దొరకాలా నాన్నకీ?" అని పెద్దపిల్ల ప్రారంభించగా రెండవపిల్ల అందుకొనియెను. "తనకి యిష్టం లేకపోతే నాన్నని వొక్కణ్ణీ అలా పిలుచుకోనియ్యి. అదేమీ బాగుందిగాదు. పెళ్ళిలో ఆ పేరు చెప్పడానికి పెళ్ళాముగూడా సిగ్గుపడుతుంది. అత్తగారు మూతివిరుస్తుంది. బావమఱుదులూ, వదినగార్లూ, మరదళ్ళూ, అస్తమానూ వేపుకొనితింటారు. చదువుకునేటప్పుడు బళ్లోపిల్లాళ్ళమాట చెప్పనే అక్కరలేదు. లేకలేక పుట్టేడు గనక, మనకందఱికీ అల్లారుముద్దుగా వున్నాడు గనక "ముద్దుకృష్ణారావు" అని పిలుద్దాము" అని యామె చెప్పెను.

మూడవపిల్ల పేరు మార్చుట కంగీకరించెను;గాని ముద్దుకృష్ణారావు అనుటకు అంగీకరింపలేదు. "లోకంలో అనేకులు బాలకృష్ణమ్మ అని పేరుగలవారిని బాలయ్య అని పిలుస్తున్నారు. అలాగే మన తమ్ముణ్ణి ముద్దుకృష్ణారావు అని

పేరుపెడితే "ముద్దయ్య" అని పిలుస్తారేమో" అని యామె ఆపేరు ఆక్షేపించి "గోపాలకృష్ణమూర్తి" అని పిలవాలి" అని ఖచ్చితముగా చెప్పెను. తాను పెట్టిన పేరును విమర్శించిన యామె పెట్టిన పేరును విమర్శింపకుండుటకు రెండవయామె చేతగానిది గాదు. "గోపాలకృష్ణమూర్తిని గోపాలం అని పిలవరా యేమిటి?" అని యామె యడుగగా నాల్గవపిల్ల "రామచంద్రం" అని పిలుద్దాము" అనియెను. "మీరేపేరు పెట్టినా సరే నేను రాజూ అని పిలుస్తాను"అని అయిదవపిల్ల చెప్పెను. అన్నిటిని పూర్వపక్షము చేసి తల్లి "రాజగోపాలము" అనిపేరు పెట్టెను. అందఱును అంగీకరించిరి. "పేరు విరిచివేయగూడదు. ఎవరేనా సగం పేరుతో పిలిస్తే మనం దెబ్బలాడాలి" అని అందఱును కూడబలికికొనిరి. ఈ రాద్ధాంత సిద్ధాంతములన్నియు విని లక్ష్మీనారాయణ "బుల్లేడా?" అని పిలువజొచ్చెను.

బుల్లేడు పాఠశాల ప్రవేశించెను. ఏటేటను పరీక్షలలో ఓడెను. పదునేడవయేట పుల్లయ్య, లేక రాజగోపాలము, అదియుగాక బుల్లేడు థర్డుఫారము పరీక్షలో నెగ్గెను. లక్ష్మీనారాయణ భావికల్పనములలో ప్రవృత్తుడయ్యెను.

"లోకంలో తెలివిలేనివాళ్ళు కొడుకులు బి.యే పరీక్ష యిచ్చేదాకా ముందు సంగతి యోచించరు. అప్పుడు ఆలోచనలు మొదలుపెడితే అంతటితో తేలేది కాదుగనక ఏదోవొక పనిలో ప్రవేశపెడతారు. అది యేమంత మంచిదీ? ముందే యోచిస్తే యీ చిక్కులు వుండవు" అని యాతడు అనేకవిధములయిన యోచనలు చేసెను. ఈ విషయమున ఆతడు భార్య సలహాగూడ పుచ్చుకోదలచెను. "మాచిన్నమ్మమ్మ కొడుకు ప్లీడరుగుమాస్తా పనిచేసి యాభైవేలు గడించాడు. అదైతే బాగుంటుంది" అని యామె చెప్పగా "ఛీ, ఎంత తెలివితక్కువదానవూ? మన బుల్లేడు వొకళ్ళ దగ్గిర గుమాస్తా పనా చేయడం?" అని లక్ష్మీనారాయణ చరచరలాడెను. "డబ్బురాని వుద్యోగాల్లో ప్రవేశపెడతారు కామోసు. నేనొప్పుకోను. నాచిట్టితండ్రి నామాట వింటాడు. మీరేమన్నా నేను అంగీకరించను" అని యామె రుసరుసలాడుచుండగా "ప్లీడరు వుద్యోగం అయితే బాగుంటుంది నాన్నా" అని చిన్నపిల్ల చెప్పెను. "నీకంటే చిన్నపిల్ల నయం. కానీ ప్లీడరు అయితే లాభమే. అయితే వాగ్ధాటీ వుంటే గాని డబ్బురాదు. బల్లలు బద్దలుకొట్టాలి. అరుపులకి తగిన డబ్బు అందరికీ రావడం కష్టం. గనక అది అంత మంచి పని గాదు. అట్టే మాటలు చెప్పగూడదు. మొదటే దర్జా గల వుద్యోగం కావాలి" అని యాతడు చెప్పెను.

ఈ సమయమున వారి పిల్లవాడు వచ్చెను. "నాన్నోయి! వో తమాషా జరిగింది యివేళ. మొన్న పొద్దున్న నాగడియారం యెత్తుకుపోయాడు వోకుర్రాడు. ఎవరో తెలిసింది గాదు మొదట, "నా గడియారం ఎక్కడో పడిపోయింది. దొరికినవాళ్ళు యిస్తే పౌంటెనుకలం క్రొత్తది బహుమతీ చేస్తాను" అని పదిమంది కుర్రాళ్ళతోటీ చెప్పెను. గడియారం కంటె కలం మంచిదనుకున్నాడు దొంగ.

ఆశపడ్డాడు. ఇవేళ పొద్దున్న వాళ్ళ రాజన్న వొచ్చి "ఇది నీగడియారమేమో చూసుకో" అని చూపించేడు. అది నాదేగాని గొలుసు దాచేశాడు. "ఇలాతే" అని పుచ్చుకొని "గొలుసుకూడా దొరుకుతుందేమో చూడు. సాయంత్రం యిస్తాను కలం" అన్నాను. "తప్పకుండా యివ్వాలిసుమా" అని వాడు వెళ్ళి యిందాకా గొలుసుకూడా తెచ్చి యిచ్చేడు. "మతి కలం తే." అన్నాడు ఆశపడి. "తొందఱపడకు నా దగ్గిర కలం లేదు. కొని యిస్తాను వేసంగి సెలవుల్లో" అని వాడికి టోపీ వేసి పంపేశాను" అని సంతోషముతో చెప్పెను. కుమారుని యుక్తికి మెచ్చి తండ్రి "వీడు దొంగల్ని బాగా పట్టుకునీలా వున్నాడు. పోలీసు ఉద్యోగం అయితే లాభం వుండేటట్టుంది. చరచరా పైకి వెళ్ళిపోతాడు. డిపిటీసూపరెంటు అయినా చాలు" అని తలచి యాతడు తన యుద్దేశమును పైకి తెలిపెను. "మొట్టమొదటే యినస్పెక్టరీ అవుతుంది. పరీక్షకి చదివేటప్పుడుగూడా నెలకి ముప్ఫయ్యో, నలభయ్యో జీతం యిస్తారు. చేతిసొమ్ము ఖర్చుపెట్టక్కరలేదు" అనిగూడ ఆతడు చెప్పెను. తల్లి అంగీకరించెను. పిల్లవాడు గూడ బాగుగా నున్నది అని తలయూచెను. అయిదవ పిల్ల "పోలీసువాళ్ళని చూస్తే నాకు భయం వేస్తుంది నాన్నా" అనగా పుల్లయ్య నవ్వెను. "మన పోలీసేలే తల్లీ! భయం లేదు" అని తల్లి చెప్పగా తండ్రి "భయం లేదమ్మా" అని చెప్పెను.

లక్ష్మీనారాయణ కల్పనా ప్రపంచమునకు రూపము ఏర్పడెను. "చిన్నపిల్లాడు. మొదటే వుద్యోగంలో వుండీ రహస్యాలన్నీ తెలవవు. నేను వెనక్కాల వుండి అన్నీ నేర్పుతూ వుంటాను. ఏనెలకానెల పదిజీతాల పెట్టయినా కళ్ళజూడకుండా నిద్రపోనీయను అబ్బాయిని" అని తలచి యాతడు "ఇక ఈ చిన్న పేర్లు అన్నీ యెందుకూ?" అబ్బాయిని ఇక పోలీస్ అని పిలుస్తూ వుందాము" అని చెప్పెను. తల్లి అందులకు అంగీకరించెను.

అంతటితో ఆమెకు తృప్తి కలుగలేదు. "అబ్బాయి - అబ్బాయి కాదు పోలీసు నేనంటే ప్రాణంగా చూస్తున్నాడు గదా? వుద్యోగం అయిన వెంటనే రొండు బనారసు చీరలూ, రొండు దక్షిణాది చీరలూ కొనుక్కుంటాను. అందులో రొండుచీరలు చిన్నమ్మాయి కట్టుకొని సరదా తీర్చుకుంటూ వుంటుంది" అని మురియజొచ్చెను.

పోలీసునకు గూడ కల్పనలు తోచెను. "ఇంట్లో చేయిస్తే ఆడపీనుగులు కక్కూర్తి చేస్తారు. ఫలహారం కాఫీహోటల్లోనుంచే తెప్పించుకోవాలి. మంచి గుర్రం వుండాలి. వెధవ సైకిలు. సైకిలు మర్యాదవస్తువు గాదు. తప్పు చేశాడంటే వాడెవడైనా సరే కైదులో పెట్టించెయ్యాలి. పుల్లయ్య కాదు - అది వెధవపేరూ - రాజగోపాలరావుగారు అంటే పట్టణం అంతా హడిలిపోవాలి. ప్రతీనాటకం కంపెనీవాళ్ళూ, ప్రతిసర్కసువాళ్ళూ, ప్రతిసినీమా వాళ్ళూ టిక్కెట్లు చచ్చినట్లు వూరకే పంపిస్తారుగదా? పిచ్చరాళ్ళు అనీ, పిచ్చ కుంచాలనీ, కల్తీ నెయ్యి అమ్ముతున్నారనీ, బెదిరించి బియ్యమూ పప్పూ వగయిరాలన్నీ వర్తకుల్ని బెదిరించి వూరికే తెప్పిస్తాను.

చాకలాళ్ళకి జీతం యివ్వను. మంగలాళ్ళకి కూడా దమ్మిడీ అయినా ముట్టచెప్పను. బెదిరించి గుఱ్ఱానికి గడ్డిగంపలు తెప్పిస్తాను. పల్లెల్లోకి వెళ్ళినప్పుడు వొక్క బెదరింపు బెదరించానంటే రైతులు లంచాల కింద రూపాయలే కాకుండా వులవలు వగైరాలు కురిపించేస్తారు" అని యింక నీరీతిగా నాతడు కల్పనలు సాగించజొచ్చెను.

ఇట్లు కల్పనములలో బుద్ధితగుల్కొనుట వలన నాల్గవఫారము పరీక్షలో నాతడు ఓడిపోయెను. గుణములు అందఱి బాలురకంటెను చాల తక్కువగా వచ్చెను. "బాగా చదివేను. బాగానే రాశాను. మేష్టర్లుగూడా నెగ్గుతా వన్నారు" అని యాతడు దైవవంచనమును తెలిపెను. తండ్రి చింతించెను. "ఇంకా మూడేళ్ళు చదవాలి తరువాత పరీక్షకో సంవత్సరము చదవాలి. అప్పుడు ఇనశ్మ్పెష్టరీ అవుతుంది. అయితీరుతుంది. నేను అందుకోసం చాలా పని చేస్తున్నాను" అని లక్ష్మీనారాయణ చెప్పగా "ఇంకా నాలుగేళ్ళు ఎలాగా? నేనింకా ముసలిదాన్నయిపోతాను. అప్పుడు అంత విలవైన చీరలు నీకెందుకంటాడేమో పోలీసు? పైవాళ్ళు గూడా వింటే యిలాగే చెపుతారు. యీరూపంగా చిన్నమ్మాయికి రెండుచీరలు ముట్టచెప్పడానికి వీలువుండదు కాబోలు" అని తల్లి చాల విచారించెను. "ఈమాటు సరిగా చదువుతాను. తప్పకుండా పరీక్షలో నెగ్గితీరాలి. నాకంటే చిన్నవాళ్ళు ముందుకు పోతున్నారు" అని పోలీసు దీక్ష పట్టెను.

"ఈ మాత్రానికి రాత్రీ పగలూ కష్టపడేదేమిటీ? నీప్రతిభ నాకు తెలుసును. పరీక్ష రెండుమాసాలు వుందనగా శ్రద్ధపట్టే వంటే పరీక్ష నెగ్గి తీరుతుంది. ఆరోగ్యం పాడుచేసుకోకు. పోలీసువాళ్ళకి బలం ప్రధానం. ఒడ్డూ పొడుగూ ఠీవీ వుంటే గాని సూపరెంటు అంగీకరించడు. అందఱు పిల్లవాళ్ళలాగా వొంగి తిరగకు. వెన్నువిరుచుకొని నడవడం యిప్పటినుంచీ నేర్చుకో" అని లక్ష్మీనారాయణ కొడుకుతోను, "పోలీసుని జాగ్రత్తగా చూస్తూవుండు. మఱికాస్త నెయ్యి తగలనియ్యి. యిప్పటినుంచీ కాఫీ చేసి యిస్తూ వుండు. అలవాటయితేగాని ముందు కష్టం. వాణ్ణి యిప్పుడు మనం జాగ్రత్తగా చూశామంటే తరువాత వాడు మనకి చాలా సుఖం కలిగిస్తాడు" అని భార్యతోడను చెప్పెను.

పోలీసుని తల్లి అట్లే చూచుచుండెను; గాని "వీడు వుద్యోగం చేసి నాకు కోకలు కొనవలసిన సమయం వచ్చేటప్పటికి నేను పూర్తిగా ముసలివరుగునై పోతానేమో" అని తరుచు తీరని విచారము పొందుచునే యుండెను.

లక్ష్మీనారాయణ షాహుకారుగుమాస్తా గనుక సంసారము ఏలోపమును లేకుండ గడచిపోవుచుండెను. తాళ్ళపూడిలోని యిల్లు ఋణదాతలు అమ్ముకొని పోయినను ఆతడెట్లో కష్టపడి రాజమహేంద్రవరమున ఆర్యాపురములో చిన్న యిల్లు సంపాదించుటవలన ఆస్తిపరుడుగనే భావించుకొనుచుండెను. "పోలీసుకి వేయునూన్నూటపదహార్లు ఇస్తేనే గాని ఎవరిపిల్లనీ చేసుకోను. వియ్యపురాలి లాంఛనాలుగూడా తగినన్ని ముట్టాలి. అయిదుగురు ఆడబడుచులూ పచ్చగావున్నారు గనుక వాళ్ళకి గూడా ముట్టాలి. పోలీసుకి పట్టుతాపితాలు,

వెండిచెంబులజోడాకూడా రావాలి. వాడు కోరితే మంచి సైకిలుగూడా యివ్వాలి. నగలు మాయిష్టం. వాళ్ళు అడుగగూడదు. పెళ్ళికి వెళ్ళినవాళ్ళకందరికి జామార్లూ, చీరలు పెట్టాలి. ఇలాంటి సంబంధం అయితే వొప్పుకుంటాను. ఆడపిల్లలికి కట్టుతప్పేదాకా పెళ్ళిళ్ళు కావడం కష్టంగా వున్న రోజులు గనక పోలీసుకి వయస్సు ముదిరినా యేమీ బాధలేదు. వో క్లాసు ఎక్కువయితే వొక వంద యెక్కువ అడగవచ్చును." అని యాతడు నిశ్చయించుకొనియెను. ఈ నిశ్చయము యొక్క వేడి తగ్గకుండ వాడపల్లి నుండి యొక సంబంధము వచ్చెను. "కట్నం యివ్వలేము. వచ్చినవారికి పప్పూఅన్నమూ పెడతాము. లాంఛనాలనీ, మామూళ్ళనీ యేమీయివ్వలేము. అయిదువందలరూపాయలకు తక్కువ లేకుండా నగలు మేము కోరినవి కొత్తవి పెట్టాలి. కాసులుకొని మాచేతులో పోస్తే మేమే చేయించుకుంటాము" అని పిల్లబావగారు చెప్పెను. "మా మామగారు వాడపల్లిలో గ్రామపురోహితుడు. వాటాలులేవు. పోటీలులేవు. శుభం వచ్చినా అశుభం వచ్చినా అంతా వారిదే. ఆవూళ్ళో భోగం వాళ్ళు చాలామంది వుండడం చేత తక్కిన శూద్రులమాట యెలావున్నా వాళ్ళవల్ల చాలా ముట్టుతూవుంటుంది. ఏ సత్యనారాయణవ్రతమో, ఏ కేదారేశ్వరుని వ్రతమో, యేతద్దినమో పేరుచెప్పి వాళ్ళు సరసులుచేత బాగా ఖర్చుపెట్టిస్తారు. ఆవూరు వచ్చే సరసులనేకులు మా మామగారి యింట్లోనే భోంచేస్తూవుంటారు గనక తక్కిన విషయాలు యెలావున్నా పురోహితుడికి మాత్రం బాగా ముట్టజెపుతూ వుంటారు" అని యాతడు పిల్ల వంశముయొక్క సాంప్రదాయమునుగూడ చెప్పెను. ఆతడుగూడ ఒక గ్రామమునకు వాటాలులేని పురోహితుడై యుండెను.

లక్ష్మీనారాయణకు అరికాలిమంట నెత్తికి వచ్చినది. "పోవయ్యా తెచ్చేవు సంబంధం. గ్రామపాదకుని పిల్లనిటయ్యా నాకొడుక్కి చెప్పవచ్చేవూ? తొరగా దయచెయ్యండి. ఇందుకోసం యిక్కడికి వచ్చేమని యెవరితోటీ చెప్పకుండా వేగంగా వెళ్ళిపొండి" అని చెప్పెను. వచ్చినవారు కోపముతో వెళ్ళిపోయిరి.

లక్ష్మీనారాయణ పండితపుత్రుడైనా అతని పూర్వులుమాత్రము అతనివరకును వేదపండితులు. ఆస్తి తక్కువయినా సాంప్రదాయము గలవారు. ఎక్కడికి వెళ్ళినను ఓహో యనిపించుకొనెడివారు. ఆయాస్తి, ఆ విద్వత్తు లేకపోయినను లక్ష్మీనారాయణకు "నాకుటుంబం ఎంత మంచిదీ?" అను గర్వము మాత్రము పూర్తిగనే యుండెను.

అయితే దైవవశమున అతని భార్య మాత్రము ఒక పగటివేషగాని దౌహిత్రియు, ఒక హాస్యగాని మరదలి కొమార్తెయునైయుండెను. బాల్యమున ఆస్తి యంతయు ఋణగ్రస్తమై యుండుటచే పెళ్ళియైనజాలునని యాతడు ఆసంబంధమును చేసికొనియెను.

కాకినాడయందలి ప్లీడర్లతోగాని, కోనసీమయందలి సంపన్నులతోగాని వియ్యమంద వలయునని లక్ష్మీనారాయణ యభిప్రాయము. ఈస్థితిలో

ఆసంబంధములు వచ్చుట కష్టమని అతనికి దెలియును; గావుననే పోలీసునకు ఇప్పుడు పెండ్లి చేయవలసిన తొందరలేదని యాతడు నిశ్చయించుకొనియెను. "ఈలోపుగానే అలాంటి సంబంధం వస్తే పోనీయగూడదు"అని యాతడు విశేషవిధి నేర్పతిచికొనియేయున్నాడు.

పోలీసు ఈ సంవత్సరము పరీక్షలో నెగ్గెను. లక్ష్మీనారాయణచేత తన కుటుంబమునకు సంబంధించిన లెక్కలన్నియు సరిచేయించుకొని ఉపాధ్యాయుడు "మీ అబ్బాయి పరీక్షలో గెలిచేడండీ!" అని చెప్పెను. "తండ్రి తెలివైనా వాడయితే కొడుకు పరీక్షలు క్షణం"అని యనుకొనుచు లక్ష్మీనారాయణ ఊర్ధ్వశ్వాసముతో ఇంటికివచ్చి భార్య కెఱింగించెను. ఆమెయు మహానందభరితయై "వుద్యోగం రావడానికి పోలీసు యింకా యెన్నాళ్ళు చదవాలీ?" అని యడిగి "వుద్యోగం పరీక్షతో నాలుగేళ్ళు" అని భర్తచెప్పగా మొగము దిగాలు వేసికొనియెను.

వారముదినముల వఱకు పోలీసు నిజముగా ఉద్యోగము వచ్చినంత సంతోషముతో తిరిగెను. భిక్షాటనముతో దినపాతము గావించుకొనుచు ఇరువురు కుమారులకు ఇంగ్లీషుభాష ప్రారంభము చేయించిన పొరుగు బ్రాహ్మణుడొకడు వచ్చి లక్ష్మీనారాయణ సమీపమున ఉన్నపుడు "మా అబ్బాయిలకి తీరిక అయినప్పుడు చదువు చెబుతారా మహరాజా?" అని యడిగెను. దీనితో పోలీసు తన విద్వత్తు నితరులుగూడ గుర్తించుచున్నారని తెలిసికొని హఠాత్తుగా జ్ఞాపకమురాగా వెన్నువిరుచుకొని పచారుచేయుచు "నాకు వ్యవధిలేదు" అని యింగ్లీషులో చెప్పెను. బ్రాహ్మణుడు తెల్లబోగా "యేమిస్తారని అడుగుతున్నాడు మావాడు" అని తెనుగుచేసి చెప్పెను. "మానాన్న వట్టి బుద్ధిలేనివాడు (నాన్సెన్సు) ఏమీ తెలవదు" అని పోలీసు ఇంగ్లీషులోనే గొణుగుకొనియెను. బ్రాహ్మణుడు "ఏమివ్వగలను మహరాజా? దినాలు వెళ్ళడమే కష్టంగా వుంది. ఇచ్చేమని మేమూ, పుచ్చుకున్నామని మీరూ సంతోషించాలి. అలా తమరే సెలవివ్వండి" అని వంగి చెప్పగా పోలీసు "వల్లపడదు" అని యింగ్లీషులోనే చెప్పెను. "బీదకబుర్లు చెబుతావేమయ్యా? బర్లో చెప్పేది యేమీ లేదు. అంతా యింట్లో చెప్పించుకుంటేనే వుంది. రేపు ప్రొద్దున్న వక కొడుకు ప్లీడరు గుమాస్తా పనీ వక కొడుకు స్కూలు మేష్టరుపనీ చేస్తూ పదేసి రూపాయలు తెచ్చే విధం చూచుకోవాలి గాని యీవేళ డబ్బుకి వెనకా ముందూ చూస్తే యెలాగా? మావాడికోసం యెంత డబ్బు ఖర్చుపెడుతున్నానో మీకేమి తెలుసును? పిసిగిపెడితే చదువుగూడా అంటదు. ఇద్దరు పిల్లలకి చదువు చెప్పాలి గనక ప్రతీరోజూ ప్రొద్దున్న మాత్రం కాఫీ వుప్మా చేసిపెడుతూ నెలకు పదిహేనురూపాయలు ఇవ్వగలరా?" అని లక్ష్మీనారాయణ జాడించియడుగగా బ్రాహ్మణుడు "ఎంతటోసినోరురా" యనుకొని ఊర్ధ్వశ్వాసముతో గుమ్మము దిగిపోయి అంతలో "గుప్పెడు బియ్యమూ పోనివ్వడం యేమీ?" అని తలచి మఱలవచ్చి తంబురమీటుచు కీర్తనలు పాడదొడగెను.

ఎంతసేపుపాడినను ప్రయోజనము లేకపోయెను. "వీడికి శాస్తిచేస్తాను" అని లక్ష్మీనారాయణ ఊరకుండెను. ఎప్పుడూ భిక్షము పెట్టి యెఱుగని లక్ష్మీనారాయణుని భార్య వాకిటిలోనికే రాలేదు. "మన సంఘం వెధవ సంఘం కాకపోతే దుక్కల్లాంటి వాళ్ళు ముష్టియెత్తుకోవడం యేమిటీ?" అని పోలీసు ఇంగ్లీషులో ననుకొనగా "నీ వంటి వాళ్ళు పుట్టిన తరువాత యిక అందుకు లోటేమీ?" అని ఆత్మ ఆతనిని తెలుగునందే ప్రశ్నించెను.

భిక్షకుడు కీర్తనమీద కీర్తన చొప్పున నాలుగు పాడెను. గాని ఎవరును పలుకలేదు. చెంబులో బియ్యపు గింజలు పడలేదు. విసువు వచ్చినది. వెంటనే భిక్షకుడు "మొండివాడు రాజుకంటే బలవంతుడు" అని పలికి వెడలిపోయెను. "దున్నపోతా; పళ్ళూడగొడతాను" అని పోలీసు ఇంగ్లీషునందే తిట్టుచూ గుమ్మము వఱకును వెళ్ళెను. "మేష్టరుతో మాట్లాడి వీడికొడుకుల పరీక్ష పాడుచేయించేస్తా"నని లక్ష్మీనారాయణ అనుకొనియెను.

లోవరు సెకండరీ పరీక్షలో జయము పొందుట పోలీసునకు ఇనస్పెక్టరు పరీక్షలో నెగ్గినట్లుండెను. వెన్నువిఱుపు అధికమయ్యెను. ప్రతివారిని "ఏయ్, ఏయ్" అని పలుకరించుట ప్రారంభమయ్యెను. తోడిబాలురతో మాటపట్టింపులు వగైరాలు వచ్చినపుడు "తన్నూ, డొక్కలో పొడూ, ముందుకు పడగెంటూ, చూస్తావేమిరా? పేగులుతీస్తా, నీ గుండెల్లో నిద్రపోతా, ముక్కు నేలపెట్టిరాసేస్తా, తంతా, పిలకవూడదీసేస్తా, చెవడాలెక్కదీస్తా, వూచిపుచ్చుకొట్టడతా, పళ్ళూడగొట్టిస్తా" మున్నగు మాటల ప్రయోగము మెండయ్యెను. మడమల తాటింపును, గొంతుబిగింపులును పరిపాటియయ్యెను. పాఠశాలలో పాఠముల యెడల కంటె జిమ్నాస్టిక్సునెడల ఆదరము మెండయ్యెను. పోలీసు ఉద్యోగులను జూచి వారి లక్షణములను తనిఖీ చేయుటయు, వాని ననుకరింపబూనుటయు ముఖ్య కృత్యములయ్యెను. పోలీసు ఇనస్పెక్టరు రూపము సర్వకాలః లయందును హృదయమున జాగరితము కాసాగెను. "ఆవస్తువులు అలా సంపాయిద్దాము. ఈ వస్తువులు ఇలా సంపాయిద్దాము. అది అలా జరుగుతుంది. ఇది యిలా జరిగితే అది అలా చేద్దాము. అప్పుడెక్కడెలా మసులుకోవాలో నాన్నకి తెలవదు. అమ్మ వట్టిగోడ. అక్కలు అస్తమానూ ఏదో కోరుతూ వుంటారు; గాని వాళ్ళకి పెట్టడమూ మానడమూ సంగతి యింటావిడమీద పెట్టేద్దాము. కాని యింటావిడకి మాత్రం అధికారం అట్టే సాగనివ్వకూడదు. మనం అంటే అది గడగడలాడాలి. గవర్నర్ని చూచినట్లుచూస్తేనే అత్తారి మొగం చూడడం. బావమఱుదులు యింట్లో చాకరీ చేస్తూ వుండవలసిందే. అక్కల మొగుళ్ళు కూడ మనం అంటే - ఏలా మసలుకోవాలో, తరువాత యోచిద్దాము; గాని ఒక్కటినిశ్చయం వాళ్ళవూళ్ళల్లో ఖూనీలు జరుగుతూవుంటాయి. దొంగతనాలు జరుగుతూ వుంటాయి. అల్లర్లూ, అకతాయిపనులూ జరుగుతూ వుంటాయి. కేసులవుతాయి. మన దగ్గరకి బకీర్లు వస్తాయి. దర్జాగా గుఱ్ఱం వెడతాము. మునసబు యెదురుగుండా వస్తాడు. గుఱ్ఱం దిగేటప్పటికి కళ్ళెం అతనే

పట్టుకుంటాడు. చెమట పడితే కోటు తీసి కరణం చేతికిస్తే పట్టుకుని నుంచుంటాడు. మంగలాళ్ళు, కాళ్ళు పిసుకుతారు. విసురుతారు. చాకలాళ్లు మూటలు - అంటే తెలిసిందా? బహుమతీలు; ఇనాములు, నజరానాలు, మామూళ్ళు, లంచాలు, వల్లకాదు, వశేనపురమును. ఇలాంటివాటికంతేమిటి? ఇలాంటివన్నీ మోస్తూ వుంటారు. బయటకు వెడితే చెంబూనీళ్ళూ తెస్తారు. వూళ్ళో వుండే లౌక్యులంతా వెంటపడి దిరుగుతూ బేరాలు జరుపుతారు. అటువంటప్పుడు మన బావలపని అధికంగా వుంటుంది. వాళ్ళు తప్పకుండా చెయ్యాలి లేకపోతే మొగం చూడం" ఇంకను ఇట్టి కల్పనలు ప్రబలెను. అంతయు సుఖమయముగానుండెను. అతడు "మనం బజారుకి వెడితే దుకాణాలవాళ్ళు ఆదరిస్తారు." అనుకొనుటయే గాని అట్లు జరుగుటలేదు. అంగడి యజమానులు ఈ కుఱ్ఱవాని బేరము లెక్కయేచేయుటలేదు. "మనకి ఖరీదు తగ్గిస్తారు" అని యాతడనుకొనుటయేగాని అదియు అట్లు జరుగుటలేదు. ముఖముచూసి బేరములు చెప్పెడి ఆవర్తకులందఱును పోలీసుదగ్గర ఆతడుకొను వస్తువులకు - అనగా సిగరెట్లపెట్టెలకు, కాఫీచూర్ణపు డబ్బాలకు, జేబురుమాళ్ళకు, కారాఖిల్లీలకు, మేజోళ్ళకు, బూటుజోడు మరమ్మత్తుకు, ఇంక నిట్టివానికి అందఱివలన కంటే అధికముగానే పుచ్చుకొనుచుండిరి. అప్పుడెల్ల నాతడు, "వెధవలు. ఇంకా వీళ్ళ ఆటలు ఎన్నాళ్ళు సాగుతాయో చూస్తాను. నేను నిజంగా పోలీసునే అయ్యితే అయినక్షణం మొదలుకొనే వాళ్ళకూట్లో దుమ్మే" అని విసుగుకొనుచుండెను.

కాలము సుఖమయ కల్పనలతోడను, దు:ఖమయ ఫలముల తోడను, గడచిపోవుచుండగా నాలుగవఫారము పరీక్షలు సమీపించెను. "నాయనా, పోలీసూ, రాత్రిళ్ళు అదే పనిగా చదివి ఆరోగ్యం పాడుచేసుకోకు. దాని ముండామోసిన పరీక్ష. నీ మేష్టరుగారు మా షాహుకారుదగ్గిరే వాడకం. అప్పుడే కత్తు కలిపేనులే. ఏమీలేదు. నాలుగురూపాయల వాడకం వాడితే రెండురూపాయల అణా తొమ్మిది పైసలే ఖర్చు రాయడం. దీనితో మేష్టరు మనచేతులో వుంటాడు. షాహుకారు తూకం చూచుకోవడమే గాని పద్దు చూడడు. నెలకో మాటు పరీక్ష చేసుకుంటే వెనకటి పద్దులన్నీ జ్ఞాపకం వుండి యేడుస్తాయి? అదంతా యెందుకూ? నేనున్నానులే" అని లక్ష్మీనారాయణ చెప్పెను. "నాన్నని బొత్తిగా కొట్టెయ్యడానికి వీలులేదు. హంగు బాగానే చేస్తాడు" అని పోలీసు అనుకొనియెను.

పరీక్ష సమీపించెను. "మావాడి సంగతి జ్ఞాపకం వుంచుకోవాలి సుమండీ" అని లక్ష్మీనారాయణ వెళ్ళి ఉపాధ్యాయునితో జెప్పెను. "నన్ను మఱచిపోకూడదు సుమండీ" అని ఉపాధ్యాయుడు బదులు చెప్పెను. "అద్దె" అని లక్ష్మీనారాయణ వెడలిపోయెను. నాటి మధ్యాహ్నము ఉపాధ్యాయుడు కొట్టుమీదికి వెళ్ళి ఏబది రూపాయల సామానుకొని "పద్దు వ్రాసికొను"మని చెప్పివచ్చెను. షాహుకారు వస్తువుల ఖరీదులు వివరముగా చెప్పెను; గాని లక్ష్మీనారాయణ ఇరువది రూపాయలు మాత్రమే ఖర్చు వ్రాసెను. గోధుమపిండి ఎత్తెడు పుచ్చుకుంటే

ఏబులమే వ్రాసెను. కాఫీ గింజల పద్దు మానివేసెను. సిగరెట్ల పెట్టె సంగతి ఉదహరింపడయ్యెను. మొత్తము మీద ఇరువది రూపాయలకు మాత్రమే పద్దు ఉండెను. మఱునాడే అమావాస్య యగుటయు, కొట్లు కట్టి వేయుటయు తటస్థింపగా, షాహుకారు ఇంటివద్ద కూర్చుండి లెక్కలు తనిఖీ చేసికొనియెను. గుమాస్తా దొంగతనము బైటపడెను. షాహుకారు యుక్తి చేసి ఉపాధ్యాయుని వలన సరియైన జాపితా పుచ్చుకొని గుమాస్తా దావా చేసి "ఇవేళ మొదలు నాగుమ్మంలోకి రాకు" అని అంక్షపెట్టెను. లక్ష్మీనారాయణకు కడుపులో రాయి పడెను. ఎవరును చేరదీయునట్లు లేకుండెను.

పరీక్షలు ముగిసెను. పోలీసు వ్రాసిన ప్రత్యుత్తరములు అంత తప్పుగా లేవు; జయము ఈయవలసియే యుండెను; గాని అతనికి జయము ఇచ్చినచో తన విషయములో లక్ష్మీనారాయణ చేసిన దొంగతనము ఇంకను ధృవపడునని తలచి మార్కులు తక్కువచేసి నష్టజాతకము చెప్పెను.

ఇట్లు గోడపెట్టును, చెంపపెట్టునుగూడ ఏకకాలమున తగులగా లక్ష్మీనారాయణ జడిసెను. కర్తవ్యము తోచలేదు. కట్టిన మేడ కూలిపోవునట్లు ఉండెను. శక్తియంతయు ధారపోసి ప్రయత్నించెను; గాని షాహుకారు చేరనీయలేదు. "ఇలా చేయడం ధర్మమా?" అని యడుగగా "నా కొంప తీసుకుంటానుటయ్యా" అని ఉపాధ్యాయుడు బదులు చెప్పెను.

లక్ష్మీనారాయణకు రాజమహేంద్రవరమంతయు అరణ్యముగా తోచెను. ఎఱిగినంతవఱ కెవ్వరును చేరదీయలేదు. కొందరు షాహుకార్లు "నీకన్ని రహస్యాలూ తెలిసే వున్నాయి గనక సొంతకొట్టు పెట్టవయ్యా" అని యెగతాళి చేసిరి. సకల విధముల నాతనికి చీమలు జెఱ్ఱులు ప్రాకినట్లు ఉండెను. "ఏమి ఆలోచించారండీ? ఏమి జరుగుతోందండీ? ఆ షాహుకారు ఏమన్నాడండీ? పోనీ ఏ ప్లీడరుదగ్గిరేనా ప్రవేశించండీ?" అని యిట్లు చీటికిని మాటికిని భార్య అడుగు ప్రశ్నలమీద ఆతనికి ఒడలు మండిపోవుచుండెను.

రెండునెలలు గడుచునప్పటికి మునిసిపలు కచేరీలో పన్నులు వసూలు చేయు ఉద్యోగము దొరకెను. "కోటలో పాగా వేశావయ్యా" అని షాహుకారు పలుకరించగా, "మఱి పన్ను చెల్లించు. అయిదు నిమిషాలు వాయిదా" అని లక్ష్మీనారాయణ నిక్కచ్చిగా అడిగెను. "అరనిమిషం కూడా అక్కర్లేదు" అని షాహుకారు పన్ను ఇచ్చివేసి "మఱి శీఘ్రంగా దయచెయ్యి నాగుమ్మంలోనుంచి. క్షణం నిలిచావంటే వేంకన్న (నౌకరు) ఎరుగుదువా?" అని ముదలకించగా ముఖము మాడ్చుకొని లక్ష్మీనారాయణ వెడలిపోయెను.

షాహుకారునకు ద్రోహము మీద పరాభవము చాల అయాసము కలిగించెను. దురదృష్ట వశమున ఆతడు మునిసిపాలిటికి కౌన్సిల్లరైయుండెను. నాటి మధ్యాహ్నమే యాతడు కచేరీకి వెళ్ళి సంగతులన్నీ తెలిపి అధ్యక్షునితో

మాట్లాడెను. "వక్కనెల మాత్రమే కాళీ రాగా ప్రాధేయపడగా యిచ్చాను. తరువాత దూరంగా వుంచుతాను" అని అధ్యక్షుడు చెప్పగా షాహుకారు వెడలిపోయెను.

సరిగా ముప్పదియవనాటి సాయంత్రము ఉద్యోగము ఆఖరయ్యెను. లక్ష్మీనారాయణకు మఱియే నౌకరీయు రాలేదు. గాని నాటిరాత్రి అంకాపొంకాలమీద జ్వరము వచ్చెను.

వైద్యుని అశ్రద్ధవలనను, పోలీసు దురదృష్టమువలనను, ముసలామెకు బనారసుచీరలును, దక్షిణాది చీరలును కట్టుకొను యోగము లేకపోవుటచేతను లక్ష్మీనారాయణ పది లంఘనములు చేసి విషమింపగా పండ్రెండవ దినమున చనిపోయెను.

పోలీసు చదువునకు విఘ్నము కలిగెను. ఇక అతడు సంసారము నిర్వహింపవలసియున్నది. పోలీసు ఇనస్పెక్టరీ గగనకుసుమమయ్యెను. పోలీసు తండ్రి చచ్చిపోయినందులకు విచారింపలేదు. సంసారభారము మీద పడినందులకు జడియలేదు. పెద్దదిక్కు పోయినందులకు జంకలేదు. ఇనస్పెక్టరీ రాలేదు. రాదు. ఇంతకంటే ఈశ్వరవంచనము లేదు.

ఇక పోలీసుశాఖయెడల ఆశ వదులుకోవలసినదేనా? పోలీసు నెలదినములు యోచించెను. బావమఱుదులు "ప్లీడరు దగ్గిరో ప్రవేశించు" అని హితము చెప్పిరి; గాని అది యాతని చెవికెక్కలేదు. "ఇనస్పెక్టరుని కాకపోతే హెడ్డును కావచ్చు. ఇది బాగుంది. కావలసినంత డబ్బు. అందఱూ బెదురుతారు" అని తలచి పోలీసు డిప్యూటీ సూపరెంటు నాశ్రయించెను. అతడు నాయడు. "బ్రాహ్మణికి చోటులేదు పోవయ్యా" అని యాతడు జవాబు చెప్పగా సూపరెంటు నాశ్రయించెను.

కోరిక సిద్ధించినది. పోలీసునకు కానిస్టేబులు ఉద్యోగము అయినది. ఆపదవిని బడసి దుస్తులు తొడిగికొని వెన్ను విరుచుకొనుచు ఇంటికి వచ్చిన క్షణమునకు ఒక కానిస్టేబులు వచ్చి "నేటి రాత్రి డిప్టీసూపరెంటు గారి యింటిదగ్గిర పడుకోవలసిన వంతునీది" అని చెప్పి వెడలిపోయెను.

❀ ❀ ❀